



హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కూచనపల్లి గ్రామస్థులు

కాలువ నిర్మాణం ఆపేయాలి

- ఆర్డీవో కార్యాలయం ఎదుట కూచనపల్లి గ్రామస్థుల ధర్నా

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం కూచనపల్లి గ్రామస్థులు మంగళవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన కాలువ గ్రామంలోని తమ ఇళ్ల మధ్య నుంచి వెళ్తుందని, భవిష్యత్తులో ప్రమాదం ఏర్పడుతుందని తక్షణమే కాలువ నిర్మాణాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తమ గ్రామశివారులో గతంలోనే కుంటలు, గొలుసుకట్టు కాలువలు ఉన్నాయని ఇప్పుడు చేపట్టే గౌరవెల్లి ప్రాజెక్టు కాలువ దేనికి ఉపయోగకరంగా ఉండదని గ్రామస్థులు పేర్కొన్నారు. గ్రామంలో ఇదివరకు ఉన్న కుంటలను, గొలుసుకట్టు కాలువలను పునరుద్ధరణ చేస్తే సరిపోతుందన్నారు. కొత్తగా చేపట్టే కాలువతో ప్రభుత్వానికి, ప్రజలకు ఎలాంటి ఉపయోగం ఉండని కాలువ నిర్మాణ పనులు రద్దు చేయాలని ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో బీఆర్ఎస్ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి, గాల్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

ఎన్‌హెచ్ 365బీ అలైన్‌మెంట్ మార్పునకు

కేంద్రం అంగీకారం

- రైతులకు నష్టం లేకుండా ప్రత్యామ్నాయ మార్గం
- ఫలించిన ఎంపీ రఘునందన్ చొరవ

7

మల్లన్న ఆలయ సమీపంలో

చైన్‌స్నాచింగ్

- 6తులాల బంగారు ఆభరణం అపహరణ

7

మోమిన్‌పేటలో ఇండస్ట్రియల్ పార్క్ శంకుస్థాపనలో పాల్గొన్న నిర్మలా జగ్గారెడ్డి



మంత్రి శ్రీధర్‌బాబుకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న నిర్మలా జగ్గారెడ్డి

స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి శ్రీధర్‌బాబుకు స్వాగతం పలికిన టీజీఐఐసీ చైర్‌పర్సన్

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ జిల్లాలోని మోమిన్‌పేట మండలంలో ఏర్పాటు చేయనున్న ఇండస్ట్రియల్ పార్క్ పనులకు శంకుస్థాపన చేయడానికి విచ్చేసిన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుకు టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్మలాజగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు అన్నివర్గాల అర్హులకు అందుతున్నాయన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుతో పాటు ఇతర రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబులు ఎంతోగానో కృషి చేస్తున్నారని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి స్పష్టం చేశారు.



శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న నిర్మలాజగ్గారెడ్డి

నేడే చివరి తేదీ

- ఎల్ఆర్ఎస్‌కు నేటితో ముగియనున్న గడువు
- జిల్లావ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులు 1,01,278
- సమకూరిన ఆదాయం రూ. 27.12 కోట్లు
- 9,517 మందికి ప్రొసీడింగ్ పత్రాల అందజేత
- 25 శాతం రాయితీ కల్పించినా కానరాని స్పందన



సిద్దిపేట ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 29: అనధికారికంగా కొనుగోలు చేసిన ప్లాట్లు, అధికారుల అనుమతి లేకుండా వెలసిన అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించేందుకు గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్)కు ప్రకటించిన గడువు నేటితో ముగియనున్నది. రాష్ట్ర ప్రభుత్వం ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు ఎల్ఆర్ఎస్‌కు మోక్షం కల్పిస్తూ ఎల్ఆర్ఎస్ చెల్లింపుల కోసం, ఫీజుపై 25 శాతం రాయితీని కల్పిస్తూ ఈ ఏడాది మార్చి 1 నుంచి 31 వరకు తుది గడువును విధించింది. ఎల్ఆర్ఎస్ చెల్లింపులకు స్పందన అంతంత మాత్రమే రావడం, పలువురు నుంచి గడువు పెంచాలని డిమాండ్ రావడంతో 25 శాతం రాయితీని కొనసాగిస్తూ ఏప్రిల్ 30కి తుది గడువును ప్రభుత్వం పెంచింది. అయినప్పటికీ జిల్లా వ్యాప్తంగా లక్షల్లో దరఖాస్తులు వచ్చినా అంతంత మాత్రమే ఎల్ఆర్ఎస్ చెల్లింపులు జరిగాయి. నేడు ఎల్ఆర్ఎస్ గడువు ముగియనుండటంతో దరఖాస్తుదారులు ఫీజులు చెల్లించాలని అధికారులు సూచిస్తున్నారు.

సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా వచ్చిన 1,01,278 దరఖాస్తులు

పేరు	దరఖాస్తులు	అనుమతి	చెల్లించింది	ఆదాయం
1. సుడా పరిధి	21,702	20,947	3,509	రూ. 5.94 కోట్లు
2. గ్రామపంచాయతీలు	20,677	19,254	4,292	రూ. 6.72 కోట్లు
3. సిద్దిపేట మున్సిపల్	33,188	27,965	4,501	రూ. 7.54 కోట్లు
4. హుస్నాబాద్	6,063	5,641	1,180	రూ. 2.46 కోట్లు
5. చేర్యాల	6,111	5285	782	రూ. 1.17 కోట్లు
6. గజ్వేల్-ప్రజ్ఞాపూర్	11,643	10,271	1,600	రూ. 3.33 కోట్లు
7. దుబ్బాక	1894	1798	254	రూ. 0.36 లక్షలు

మొత్తంగా 1,01,278 దరఖాస్తులు

జిల్లావ్యాప్తంగా మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు, సుడా అథారిటీ పేరిట మూడు కేటగిరీలుగా దరఖాస్తులను అధికారులు విభజించారు. వీటిలో జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలు సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల, 23 మండలాలకు సంబంధించి, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కింద సిద్దిపేట, సిద్దిపేట అర్బన్, చిన్నకోడూరు, నంగునూరు, కొండపాక నుంచి ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణకు అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 1,01,278 దరఖాస్తులు రాగా, వాటిని పరిశీలించిన అధికారులు 91,161 దరఖాస్తులకు ఫీజు చెల్లించేందుకు అనుమతినిచ్చారు. మిగతా దరఖాస్తుల్లో క్రమబద్ధీకరణకు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో తిరస్కరించారు. ఎల్ఆర్ఎస్ రెగ్యూలరైజేషన్‌లో భాగంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామసభలలో సైతం అధికారులు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.

వచ్చిన ఆదాయం రూ. 27.12 కోట్లు

జిల్లావ్యాప్తంగా 1,01,278 ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. వీటిలో జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో 58,899 దరఖాస్తులకు గానూ 50,360, సుడా పరిధిలో 21,702 దరఖాస్తులకు 20,947, గ్రామ పంచాయతీల్లో 20,677 దరఖాస్తులకు 19,254 దరఖాస్తులకు ఫీజు చెల్లించేందుకు అధికారులు అనుమతినిచ్చారు. పలు దరఖాస్తుల్లో భూములకు సంబంధించి పత్రాలు సరిగా లేకపోవడం, చెరువులు, నిషేధిత స్థలాలు, కుంటలు, బఫర్‌జోన్ స్థలాల్లో క్రమబద్ధీకరణకు అధికారులు అనుమతించకపోవడంతో మొత్తంగా 91,161 దరఖాస్తులకు మాత్రమే ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేలా అధికారులు నిర్ణయించారు.

మిగతా 8లో..

తోటపల్లి భూములు తిరిగివ్వాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రైతుల వినతి



భూములపై విచారణ చేపట్టాలని కలెక్టర్‌ను ఆదేశిస్తూ సంతకం చేస్తున్న మంత్రి

కోహెడ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : కోహెడ, బెజ్జంకి మండలాల నుంచి తోటపల్లి రిజర్వాయర్ కోసం సేకరించిన భూములు తిరిగి ఇవ్వాలని బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కోహెడ మండలం రాంచంద్రపూర్ గ్రామానికి చెందిన రైతులు కరీంనగర్ జిల్లా చిగురుమామిడిలో కలిసి మంగళవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నామని సుమారు 600 ఎకరాల సాగు భూమి ప్రభుత్వం ఆధీనంలో ఉందన్నారు. 2007 నుంచి రైతులమే సాగు చేసుకుంటున్నామని విన్నవించారు. తిరిగి తమ భూములు తమకు ఇవ్వాలని మంత్రి వద్ద మొరపెట్టుకున్నారు. ఈ విషయంపై పొన్నం సానుకూలంగా స్పందించారు. విచారణ చేపట్టాలని కలెక్టర్ మనుచౌదరిని మంత్రి ఆదేశించారు. మంత్రిని కలిసిన వారిలో రైతులు అన్నాడి వెంకట్ రెడ్డి, బొబ్బల మహేందర్ రెడ్డి, బత్తుల రాజు, బినవేణి రామస్వామి, ఐలయ్య, శనిగరం రామస్వామి, బినవేణి లక్ష్మణ్, ఫైల మల్లేశం, బోలు మల్ల దేవ మ్మ, దొమ్మటి భారతవ్వ ఉన్నారు.

విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో కష్టపడి చదువుకుంటేనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇంటర్మీడియట్‌లో స్టేట్ ఫస్ట్‌ర్యాంకు సాధించిన రాధారపు వైష్ణవిని మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాలువతో సత్కరించి అభినందించారు. తెలంగాణ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ ఎన్సాన్‌పల్లిలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీఎస్‌లో వైష్ణవి 468/470 మార్కులు సాధించి ఫస్ట్ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా వైష్ణవితో పాటు వారి తల్లిదండ్రులను మంత్రి శాలువా కప్పి సన్మానించి మాట్లాడారు. వైష్ణవి ఈ ప్రాంత విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిందన్నారు. గురుకులాల్లో చదువుకుని ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన దాదాపు 150 మంది విద్యార్థులకు సన్మానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ బంక చందు, చిత్తారి రవీందర్, మాజీ కౌన్సిలర్లు ఉన్నారు.



ఇంటర్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన వైష్ణవికి శాలువా కప్పి అభినందిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్



ఎప్‌సెట్ పరీక్షలు షురూ

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఎప్‌సెట్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని వెరిటాస్ అండ్ వర్చుస్ ఇంజనీరింగ్ సర్వీసెస్, ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాలలలో ఈ పరీక్షలు నిర్వహించారు. మొదటి రోజు అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కోర్సులకు రెండు సెషన్లలో పరీక్షలు జరిగాయి. మొదటి సెషన్‌లో 150 మంది విద్యార్థులకు గానూ 130 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన రెండో సెషన్‌లో 150 మంది విద్యార్థులకు 127 మంది హాజరయ్యారు. 23 మంది గైర్హాజరయ్యారు. ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన రెండు సెషన్లలో 50 మందికి గానూ 48 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆలస్యంగా వచ్చిన ఎనిమిది మందిని అధికారులు అనుమతించలేదు.

అకాల వర్షం


గజ్వేల్, ఏప్రిల్29(ఆంధ్రజ్యోతి): అకాల వర్షంతో అంతా ఆగమాగమైంది. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతో పాటు మండల వ్యాప్తంగా గాలిదుమారంతో కూడిన భారీ వర్షం కురిసింది. పలుచోట్ల కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోవడంతో పాటు కొట్టుకుపోయింది. గజ్వేల్ పరిధిలోని పలుచోట్ల ప్రజ్ఞాపూర్‌కు చెందిన బత్తుల మహేందర్ కోళ్ల ఫారం షెడ్ కొట్టుకుపోయింది. ములుగు మండలంలో భారీగా రాళ్లతో కూడిన వర్షం కురియడంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఎక్కడికక్కడ పంటలు చెల్లాచెదురవడంతో పాటు రోడ్డుపై పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి.

దుబ్బాక, తొగుట మండలాల్లో..

తొగుట: దుబ్బాక మండలంతో పాటు తొగుట మండలంలో మంగళవారం సాయంత్రం అకాల వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లోకి రైతులు తెచ్చిన ధాన్యం తడిసిపోయింది. రైతులు పంట కాపాడుకోవడం కోసం పడరాని పాట్లు పడ్డారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు.



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రింగ్‌రోడ్డుపై కొట్టుకుపోయిన ధాన్యం



తొగుట మండలం చందాపూర్‌లో తడిసిన ధాన్యం



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలో కొట్టుకుపోయిన కోళ్లఫాం రేకులు



సిద్దిపేటలో వానలోనే వెళ్తున్న వాహనదారులు

భూ భారతితో రైతులకు మేలు

- కలెక్టర్ మనుచౌదరి



మర్కుక్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

ములుగు/మర్కుక్/చేర్యాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): భూ భారతి ద్వారా రైతుల భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. మంగళవారం ములుగు మండల కేంద్రంలో, మర్కుక్ మండల కేంద్రంలోని రైతువేదికలో, కొమురవెల్లి మండలకేంద్రంలో భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా భూభారతి చట్టంలోని వివిధ అంశాలను జిల్లా అదనపు కలెక్టర్ రైతులకు, ప్రజలకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ఆధార్ తరహాలో భూదార్ కార్డును పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రైతులకు ఉచిత న్యాయ సహాయ కేంద్రాలు ఏర్పాటు చేస్తూ గ్రామస్థాయిలో రెవెన్యూ రికార్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేసి రైతులకు అందుబాటులో ఉంచుతామని స్పష్టం చేశారు. అనంతరం రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్ వేరేచోట నిర్మిస్తాం

ములుగు మండలం వంటిమామిడి కూరగాయల మార్కెట్ మరోచోట ఏర్పాటు చేసి రైతులకు వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. మంగళవారం ములు గు మండలంలోని వంటిమామిడి కూరగాయల మార్కెట్ ముందున్న స్థలాన్ని సందర్శించారు. మార్కెట్ అధికారులు, పోలీసులు, రైతులు వ్యాపారులు వాహనాలు ఎక్కువ రావడం వల్ల ట్రాఫిక్ జామ్ అవుతుందని కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ మార్కెట్ యార్డుకు ముందర గల చిన్న తిమ్మాపూర్ మరియు లక్ష్మక్కపల్లి గ్రామాలకు సంబంధించిన 55 ఎకరాల స్థలసేకరణకు రూ.8.73 కోట్లు చెల్లించడం జరిగిందన్నారు. వీలైనంత త్వరగా వాహనదారులకు అవస్థలు లేకుండా ఈ వంటిమామిడి కూరగాయల మార్కెట్‌ను అక్కడికి తరలించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ విజయమోహన్, వైస్‌చైర్మన్ ప్రభాకర్ గుప్త, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, మార్కెట్ కార్యదర్శి రేవంత్ ఉన్నారు.

లబ్ధిదారులకు పట్టాలు అందజేయాలి

మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని 325 సర్వే నంబర్‌లో గల రైతులకు భూ పట్టాలు అందజేయాలని మంగళవారం కలెక్టర్‌కు ఎర్రవల్లి తాజా మాజీ సర్పంచ్ మొండి భాగ్య భిక్షపతి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఎర్రవల్లిలోని 325 సర్వే నెంబర్‌లో ఉన్న రైతులు పేద రైతులేనని వారికి భూ హక్కు కలిగిస్తే వారిని ఆదుకున్న వారవుతామన్నారు. సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్న భూమి నేటికైనా రైతుల కోసం పంపిణీ చేయాలని అన్నారు.

రైతులకు ఇబ్బందులు కలగొద్దు

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులూ కలిగించకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మనుచౌదరి సూచించారు. కొమురవెల్లి మం డలం మర్రిముస్త్యాలలోని కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. రైతులతో మాట్లాడి ఇబ్బందులు తెలుసుకున్నారు. లారీల కొరత ఉందని, అకాలవర్షాల వలన ధాన్యం తడిసి నష్టపోతున్నామని రైతులు కలెక్టర్ ఎదుట వాపోయారు. గన్నీబ్యాగులు, తేమ కొలిచే యంత్రాలు, జల్లి యంత్రాలు, కాంటా, లిఫ్టింగ్ ఇతరత్రా విషయాలపై ఆరా తీసి పలు సూచనలు చేశారు.

మందుబాబు వీరంగం

- హనుమాన్ విగ్రహంపై పాదం మోపిన ప్రబుద్ధుడు
- సామగ్రి, అమ్మవార్ల మండపాల ధ్వంసం

7

విత్తన సంపదను కాపాడుకుందాం

- చిరుధాన్యాల్లోనే పోషకాలు అధికం
- డీడీఎస్-కేవీకే సలహాదారు డాక్టర్ గౌరీశంకర్, డీడీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దివ్య

7

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం

వెల్దుర్తి/జహీరాబాద్/నాగల్‌గిద్ద ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యమయ్యారు. ఈ మేరకు మంగళవారం వారి కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు.

వెల్దుర్తిలో



చల్ల కొమురమ్మ

బంధువుల ఇంటికి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైంది. ఈ ఘటన వెల్దుర్తిలోని శేరి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శేరి గ్రామానికి చెందిన చల్ల కొమురమ్మ(46) 45 రోజుల క్రితం బాగిర్తిపల్లిలో ఉన్న తన బంధువుల ఇంటికి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో అప్పటి నుంచి ఎక్కడ వెతికినా ఆచూకీ లేదు. దీంతో కొమురమ్మ కూతురు అలివేణి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాగల్‌గిద్దలో



తెనుగు అంజన్న

కిరాణా సామాన్లు తీసుకువస్తానని చెప్పి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైయ్యాడు. గ్రామానికి చెందిన తెనుగు అంజన్న(42), ఈనెల 28న ఉదయం 10 గంటలకు నారాయణఖేడ్ వెళ్లి కిరాణా సామాన్లు తీసుకువస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. తిరిగి రాక పోవడంతో బంధువుల, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అంజన్న భార్య సావిత్రి మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై బి.సాయిలు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు 7893492520, 8712656762 నెంబర్లకు సమాచారం అందించాలన్నారు.

జహీరాబాద్‌లో



ద్యారంగుల స్వప్న

పట్టణంలోని బాగారెడ్డిపల్లికి చెందిన ద్యారంగుల స్వప్న(20) అదృశ్యమైంది. జహీరాబాద్ పట్టణ ఎస్సై కాశీనాథ్ కథనం ప్రకారం.. బాగారెడ్డిపల్లికి చెందిన కేశప్ప కూతురైన ద్యారంగుల స్వప్న పట్టణంలోని భవాని మందిర్ వద్ద ఓ టైలర్ షాపులో టైలరింగ్ నేర్చుకుంటుంది. రోజూ మాదిరిగానే స్వప్న ఈ నెల 25న టైలర్ షాపుకు వెళ్లింది. ఎంతవరకు తిరిగి రాకపోవడంతో కుటుంబీకుల, ఇరుగు, పొరుగు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లేదు. దీంతో యువతి తండ్రి కేశప్ప జహీరాబాద్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కాశీనాథ్ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

● రూ. లక్షావేల ఆస్తి నష్టం ● తప్పిన పెను ప్రమాదం

తొగుట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి సుమారు రూ.లక్ష 35వేల వరకు ఆస్తినష్టం జరిగింది. ఈ సంఘటన మంగళవారం తొగుట మండలం కాన్గల్ గ్రామంలో జరిగింది. నాయిని ఎల్లవ్వ ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. గ్రామస్థులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమందించి తక్షణ చర్యలు చేపట్టారు. దాంతో పెనుప్రమాదం తప్పింది. ఎల్లవ్వ ఇంట్లోని బియ్యం, దుస్తులు, అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.1లక్ష 35వేల వరకు ఆస్తినష్టం కలిగినట్లు రెవెన్యూ అధికారి అశోక్ రాజ్ తెలిపారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది, కూలిపోయిన ఇల్లు

తండ్రి మందలించడంతో కొడుకు ఆత్మహత్య

మద్దూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తండ్రి మందలించినందుకు కొడుకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన ఎర్రబచ్చుల బలరాం కుమారుడు చంద్రకాంత్(24) ఏ పనిపాట లేకుండా ఇంటి వద్దనే ఉంటుండటంతో ఏదైనా పని చేసుకుని కుటుంబానికి అండగా నిలవాలని తండ్రి మందలించడంతో చంద్రకాంత్ ఫ్యానుకు ఉరివేసుకుని చనిపోయాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్‌మహబూబ్ తెలిపారు.

అదుపుతప్పి ధాన్యం లారీ బోల్తా



బోల్తాపడ్డ లారీ

రామాయంపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అక్కన్నపేట శివారు జాతీయ రహదారిపై ధాన్యం లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాద ఘటనలో డ్రైవర్, క్లీనర్లు క్షేమంగా బయటపడ్డారు. వరి ధాన్యం లోడ్ చేసుకొని రామాయంపేట వైపు వస్తుండగా లోడ్ అధికమై ఒక్కసారిగా డ్రైనేజీ కాలువలో పడిపోయింది.

కడుపునొప్పి భరించలేక బాలిక ఆత్మహత్య

వర్గల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి భరించలేక బాలిక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని అంబర్‌పేట గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్నది. గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట గ్రామానికి చెందిన మన్నె శ్రీనివాస్, రేణుక దంపతుల చిన్న కూతురు జ్యోతి(17) కూచారం కస్తూర్బా గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. పరీక్షలు పూర్తి కావడంతో అంబర్‌పేట గ్రామంలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. మంగళవారం సాయంత్రం జ్యోతికి కడుపు నొప్పి రావడంతో భరించలేక సమీపంలోని మామిడి తోటలో చెట్టుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. జ్యోతికి కొంత కాలంగా విపరీతమైన కడుపు నొప్పి వస్తున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



అవును.. చేతితో గీసినవే..

ఆకట్టుకుంటున్న నాగ శృతి గీసిన చిత్రాలు



చేగుంట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఫోటోగ్రఫీలా కనిపిస్తున్న ఈ చిత్రాలన్నీ.. చేతితో గీసినవే. ఎలాంటి శిక్షణ లేకుండానే అనేక దేవతా మూర్తుల చిత్రాలను గీసి శభాష్ అనిపించుకుంటున్నది మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం గ్రామానికి చెందిన గడ్డం నాగ శృతి. బీటెక్ పూర్తి చేసిన ఆమె ప్రస్తుతం టెక్ మహీంద్రాలో ఉద్యోగం చేస్తున్నారు. చిన్నప్పటి నుంచి చిత్రలేఖనంపై ఆసక్తి ఉండటంతో సమయం దొరికినప్పుడల్లా దేవతామూర్తుల చిత్రాలను గీస్తూ కళా నైపుణ్యాన్ని పెంపొందించుకున్నారు. వినాయకుడు, పార్వతీ పరమేశ్వరులు, వేంకటేశ్వరుడు, అలవేలుమంగా, శ్రీకృష్ణుడు, గోవులు, గోపికలు వంటి అనేక చిత్రాలను వేసి ఔరా అనిపించారు. పెయింటింగ్‌కు కావలసిన అమెరికన్ డైమండ్స్, 22 క్యారెట్ గోల్డ్ పూత రంగు తదితర ముడిసరుకును తంజావూరు నుంచి తెప్పించుకుంటారు. మూడులు నెలలు శ్రమించి వేంకటేశ్వరస్వామివారి చిత్రాన్ని గీశారు. దీనికోసం రూ.6 లక్షల వరకు ఖర్చు చేసినట్లు నాగశృతి తెలిపారు. స్వామివారి చిత్రపటాన్ని నేడు అక్షయ తృతీయను పురస్కరించుకుని ఓ స్వచ్ఛంద సంస్థకు బహూకరించనున్నట్లు తెలిపారు.







తాను గీసిన వేంకటేశ్వరస్వామి చిత్రపటంతో నాగశృతి

మర్కుక్ మండలానికి అరుదైన అవకాశం

● ఎస్ఆర్‌పీలుగా ఇద్దరు ఎంపిక



చిన్నబ్రహ్మయ్య, రాధాకృష్ణ

మర్కుక్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రిసోర్స్ పర్సన్స్(ఎస్ఆర్‌పీ)ల ఎంపికలో మర్కుక్ మండలానికి అరుదైన అవకాశం లభించింది. వేసవి సెలవుల్లో రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు 152 మందిని సబ్జెక్టు రాష్ట్ర రిసోర్స్ పర్సన్స్‌గా విద్యాశాఖ ఎంపిక చేసింది. మొత్తం 641 మంది దరఖాస్తు చేసుకోగా హైదరాబాద్‌లో జరిగిన ఇంటర్వ్యూకు 393 మంది హాజరయ్యారు. ఇందులో సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికైనట్లు మండల విద్యాధికారి వెంకటరాములు తెలిపారు. దామరకుంట జడ్పీహెచ్ఎస్ భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు చిన్నబ్రహ్మయ్య, అంగడికిష్టాపూర్ పూర్వ ప్రధానోపాధ్యాయుడు, ప్రస్తుత ఎర్రవల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఓంకార్ రాధాకృష్ణ ఎస్ఆర్‌పీలుగా ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఒకే మండలం నుంచి ఇద్దరికి అవకాశం లభించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. వీరికి పలువురి నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

ఘనంగా ఫలప్రద యాగం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు

కొండపాక, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం మర్పడగ విజయ దుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో మంగళవారం కృత్తికా నక్షత్రం సందర్భంగా సర్వేప్సిత ఫలప్రద యాగం ఘనంగా నిర్వహించారు. చెప్పెల హరి నాథశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు శాస్త్రోక్తంగా జరిపారు. గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభమై లక్ష్మి గణపతి, రుద్ర, దేవీ నవావరణ, మూల మంత్ర సమ్మేళన సుబ్రహ్మణ్య త్రిశతి హవనములు, పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ సత్యం, క్షేత్ర కమిటీ సభ్యులు మర్యాల రవీందర్, విఠల్, మల్లికార్జున్, నర్సింహారెడ్డి, రాజేంద్రప్రసాద్, తిరుపతి రెడ్డి, మోహన్ దాస్, మల్లేశం, సాయి తదితరులు పాల్గొన్నారు.

రసాయన పరిశ్రమ వద్దంటూ ఆందోళన



పరిశ్రమ గేటు వద్ద ఆందోళన చేపట్టిన గ్రామస్థులు

చిన్నశంకరంపేట ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) పచ్చని వాతావరణంలో రసాయన పరిశ్రమ ఏర్పాటు చేయొద్దంటూ మండలంలోని చందంపేట గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సదరు పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తూ పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇప్పటికే ఓ రసాయన పరిశ్రమతో అనారోగ్యాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నెల క్రితం పరిశ్రమకు వ్యతిరేకంగా పంచాయతీ కార్యదర్శి పద్మ ఆధ్వర్యంలో తామంతా తీర్మానం చేసి మెదక్ డీఎల్పీవోకు అందజేసినా పనులు సాగిస్తుండడంపై మండిపడ్డారు. పరిశ్రమ ఏర్పాటును విరమించుకోవాలన్నారు.

గౌరాయపల్లిలో వీరగల్లుల గుర్తింపు







చేర్యాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం గౌరాయపల్లి గ్రామంలో వీరగల్లులను కొత్త తెలంగాణ చరిత్ర బృందం గుర్తించింది. నంగునూరుకు చెందిన ఆ బృంద పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ కొద్దిరోజులుగా పరిశీలన జరిపారు. మూడు వీరగల్లులలో ఒకటి రాష్ట్ర కూటరాజుల కాలం నాటిది కాగా, మిగిలిన రెండు 17వ శతాబ్ధానికి చెందిన పులివేట వీరగల్లుగా ఉన్నట్లు తెలిపారు. వంగిన వెదురుగుడ కొసకు శైవభక్తుడు తన సిగముడిని కట్టుకుని అంజలి పట్టి యోగాసనంలో కూర్చుని ఉండగా, అతడి మెడ నరికి వేయడానికి ప్రయత్నిస్తున్న వ్యక్తి కత్తిచేతిలో పట్టుకుని పక్కనే కనిపిస్తున్నాడని వివరించారు. పై భాగంలో దైవసాన్నిధ్యాన్నిపొందిన వీరుడు కనిపిస్తున్న శైలిని బట్టి రాష్ట్రకూటుల కాలంనాటిదని బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ పేర్కొన్నారు. మధ్యయుగచరిత్ర ఆనవాళ్లుగా ఉన్నాయని తెలిపారు.

మల్లన్న ఆలయ సమీపంలో చైన్‌స్నాచింగ్

● 6తులాల బంగారు ఆభరణం అపహరణ

చేర్యాల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున చైన్‌స్నాచింగ్ చోటుచేసుకోవడం కలకలం రేపింది. వివరాలిలా ఉన్నాయి. కొమురవెల్లి గ్రామానికి చెందిన వనపర్తి భాగ్యమ్మ మల్లన్న ఆలయ నుంచి తోట బావికి వెళ్లేమార్గంలోని గోశాల సమీపంలో చిరు కిరాణా వ్యాపారం నిర్వహించుకుంటూ జీవిస్తున్నారు. రోజులాగే మంగళవారం తెల్లవారుజామున సుమారు ఐదుగంటల సమయంలో రాజగోపుర దుకాణం వద్దకు చేరుకుని సామాగ్రి భద్రపరిచిన పరదాను తొలగిస్తున్నది. ముఖానికి గుడ్డను ధరించిన గుర్తుతెలియని వ్యక్తి వెనకనుంచి వచ్చి భాగ్యమ్మ తలను కిందికి అదిమిపట్టి మెడలోని ఆరు తులాల బంగారు గొలుసు అపహరించుకుని పరారయ్యాడు. 100 నంబరుకు డయల్ చేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఆలయ పరిసరాలలో బిగించిన సీసీ టీవీ ఫుటేజీలను సీఐ ఎల్ శ్రీను, ఎస్ఐ రాజు పరిశీలించినా నిందితుడి జాడ దొరకలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఆలయ పరిసరాలలోని పలు సీసీ కెమెరాలు సక్రమంగా పని చేయడం లేదు. ఘటన చోటుచేసుకున్న ప్రదేశానికి చేరువన తోట బావికి వెళ్లేమార్గంలోని సీసీ కెమెరా పనిచేసి ఉండి ఉంటే ఇదేమార్గం గుండా నడుచుకుంటూ వెళ్లిన ఆగంతకుడి ఆచూకీ లభ్యమయ్యేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆలయ వర్గాలు, పోలీస్ శాఖల మధ్య సమన్వయలోపంతో సీసీ కెమెరాల నిర్వహణపై చేతులెత్తేయడంతో ఈ పరిస్థితి నెలకొన్నది. యేటా సీసీకెమెరాల నిర్వహణకు లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ధాన్యం బస్తాలు చోరీ



ఆటోలో నింపిన ధాన్యం బస్తాలు



పట్టుబడిన నిందితులు

కోహెడ, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) ఐకేపీ కేంద్రాల వద్ద నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలు చోరీకి గురయ్యాయి. వివరాల్లోకి వెళ్లితే మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బైరి కనకయ్య, కుమారుడు సతీష్‌లు 45 బస్తాల ధాన్యాన్ని పోరెడిపల్లి ఐకేపీ కేంద్రంలో సోమవారం విక్రయించారు. తీవ్రమైన ఎండతో హమాలీలు లారీలోకి బస్తాలు వేయకుండా అక్కడే పెట్టారు. సోమవారం రాత్రి కేంద్రంలోకి ఆటో వచ్చిన శబ్ధం గమనించిన సమీపంలో నివసిస్తున్న కొందరు రైతులు అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే ఏపీ 36 టీప 3709 నంబర్‌గల ఆటోలో ధాన్యం బస్తాలను వేస్తున్నారు. వెంటనే రైతులు చుట్టుపక్కలవారిని అప్రమత్తం చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకుని డయల్ 100కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు నిందితులను విచారించగా హుస్నాబాద్, అక్కన్నపేట మండలాలకు చెందినవారుగా తేలింది. పలుమార్లు వివిధ కేంద్రాల వద్ద ధాన్యం ఎత్తుకెళ్లి హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో ఒక వ్యాపారికి అమ్మినట్లు వెల్లడైంది. కాగా, బాధిత రైతు 6 క్వింటాళ్ల ధాన్యం ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఎస్ఐ అభిలాష్ కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

మందుబాబు వీరంగం

● హనుమాన్ విగ్రహంపై పాదం మోపిన వైనం
● సామగ్రి, అమ్మవార్ల మండపాల ధ్వంసం



ధ్వంసమైన ఆలయ ఆవరణలోని అమ్మవార్ల మండపాలు



నిందితుడు అజయ్

చేర్యాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం వేచరేణి శివారు ఎల్లదాసునగర్ కాలనీకి చెందిన ఊపిరి అజయ్ తాగిన మైకంలో వీరంగం సృష్టించిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యాహ్నం వేళ మద్యం సేవించిన అజయ్ కొమురవెల్లి-చేర్యాల ప్రధానరహదారి పక్కన గల హనుమాన్ దేవాలయంలోకి చొరబడి హనుమాన్ విగ్రహంపై పలుమార్లు పాదం మోపి అవమానపరిచాడు. ఆలయ ఆవరణలోని జలపోశమ్మ, ఉప్పలమ్మ, పోచమ్మ, నల్లపోచమ్మ దేవతామూర్తుల మండపాల పైకప్పులతో పాటు అద్దాలను ధ్వంసం చేశాడు. గమనించిన చుట్టుపక్కలవారు పట్టుకుని దేహశుద్ధిచేసి పరారీ కాకుండా తాడుతో కాళ్లు, చేతులు కట్టి వేసి పోలీసులకు సమాచారం అందించారు. ఇదిలా ఉండగా, హనుమంత్ విగ్రహంపై పాదం మోపి మలినం చేసిన విషయం తెలుసుకున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ సభ్యులు అక్కడికి చేరుకుని ఆగ్రహం వ్యక్తంచేశారు. దాడికి ఒడిగట్టిన అజయ్‌ను శిక్షించాలని డిమాండ్ చేశారు.



విత్తన సంపదను కాపాడుకుందాం

● చిరుధాన్యాల్లోనే పోషకాలు అధికం
● డీడీఎస్-కేవీకే సలహాదారు డా.గౌరీశంకర్, డీడీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దివ్య



మాట్లాడుతున్న డీడీఎస్-కేవీకే సలహాదారు డా.గౌరీశంకర్

జహీరాబాద్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : సంస్కృతి, సంప్రదాయాల తరహాలో విత్తన సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని డీడీఎస్-కేవీకే సలహాదారు డా.గౌరీశంకర్, డీడీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దివ్యలు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని పస్తాపూర్‌లో అంతర్జాతీయ విత్తనదినోత్సవాన్ని నిర్వహించారు. 35 గ్రామాలకు చెందిన మహిళా రైతులు సుమారు 80 రకాల విత్తనాలను తీసుకువచ్చి ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విత్తన సంపదను కాపాడుకోవడంలో రైతులు ఆసక్తి చూపకపోవడంతో ఆహారధాన్యాల కొరత ఏర్పడుతుందన్నారు. 40 సంవత్సరాల క్రితం ఏర్పాటైన డీడీఎస్ మహిళా సంఘాలను అభివృద్ధి చేస్తూ చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నదన్నారు. డీడీఎస్ మహిళా రైతులు సంఘటితమై చిరుధాన్యాల విత్తనాలను పోగుచేయడం, పోషకాలిచ్చే చిరుధాన్యాలను పండించడం తమకు ఎంతగానో సంతృప్తినిస్తుందన్నారు. విత్తనాలను కాపాడుకునే సంస్కృతిని ముందుతరాలకు పరిచయం చేయాలని సూచించారు. అనంతరం బిడెకన్నె చంద్రమ్మ, హుమ్నాపూర్ లక్ష్మమ్మ, పూలమ్మ, సుక్కమ్మ, జనరల్ నర్సమ్మ, గుంజోటి నర్సమ్మ మొగులమ్మ, తదితరులు మాట్లాడుతూ విత్తనాలతోనే జీవనోపాధి లభిస్తుందని, విత్తన సంపదను డీడీఎస్ స్ఫూర్తితో కాపాడుకుంటున్నామన్నారు. విత్తనాలను తీసుకువచ్చిన రైతులకు డీడీఎస్ అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల రక్షణకు సహకరించాలి

● సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

జిన్నారం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. మంగళవారం జిన్నారంలో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన అదనపు ఎస్పీ సంజీవరావుతో కలిసి హాజరై మాట్లాడారు. ఇటీవల జిన్నారంలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులు, స్థానికేతరుల అసత్య ప్రచారాలను నమ్మవద్దన్నారు. కాగా, ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల్లో అరెస్టు అయిన వారిపై కేసులు ఎత్తివేయాలని స్థానికులు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐలు నయిమోద్దీన్, రవీందర్‌రెడ్డి, వినాయక్‌రెడ్డి, ఎస్ఐ నాగలక్ష్మి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఫైరింగ్ రేంజ్ పనుల పరిశీలన



నార్సింగిలో ఫైరింగ్ రేంజ్ పనులను పరిశీలిస్తున్న మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

చేగుంట ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్ గ్రామ శివారులోని పోలీస్ ఫైరింగ్ రేంజ్ పనులను మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఫైరింగ్ ప్రాక్టీస్ కొరకు వేరే జిల్లాలకు వెళ్లాల్సి వచ్చేదని మెదక్ జిల్లాలోని నార్సింగ్‌లో పోలీస్ ఫైరింగ్ రేంజ్ పనులు వేగవంతం జరుగుతున్నాయని మే 2న ఐజి చేతుల మీద ప్రారంభోత్సవానికి సిద్ధమైందన్నారు. మెదక్ జిల్లా పోలీస్ సిబ్బంది ఫైరింగ్ రేంజ్ కల త్వరలోనే సహకారం అవుతుందన్నారు. ఆయన వెంట రామాయంపేట సీఐ వెంకటరాజా గౌడ్ , ఆర్ ఐ శైలేందర్, నార్సింగ్ ఎస్ఐ అహ్మద్ మొహినుద్దిన్. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

'పహల్గాం' మృతులకు శ్రద్ధాంజలి

● ఐఐటీహెచ్ విద్యార్థులు, అధ్యాపకులు శాంతి ర్యాలీ



శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఐఐటీహెచ్ అధ్యాపకులు, విద్యార్థులు

కంది, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తీవ్రవాదానికి ఐఐటీహెచ్ వ్యతిరేకమని డైరెక్టర్ బీఎస్ మూర్తి అన్నారు. సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హెచ్‌లో ఆయన మంగళవారం సాయంత్రం విద్యార్థులు, అధ్యాపకులతో పహల్గాం మృతుల ఆత్మకు శాంతి కలుగాలని ఆకాంక్షిస్తూ కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు ఐఐటీహెచ్ ప్రాంగణంలో ర్యాలీ చేశారు. తీవ్రవాదానికి తమంతా వ్యతిరేకమని, పహల్గాం ప్రాణ నష్టం తమని కలిచి వేసిందని ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. పహల్గాం బాధితులకు న్యాయం జరగాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఐఐటీహెచ్ అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మామిడి పచ్చళ్ల తయారీ షురూ..

● ఒక కాయ ధర రూ.10 నుంచి రూ.15



అక్కన్నపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నిల్వ పచ్చళ్ల తయారీకి ప్రాధాన్యమిస్తారు. ప్రధానంగా నోరూరించే మామిడి పచ్చడిని పెట్టేందుకు అన్ని వర్గాల ప్రజలు ఆసక్తి చూపిస్తారు. ఈసారి మాత్రం పేద, మధ్యతరగతి ప్రజలకు మామిడి పచ్చడి తయారీ భారంగా మారింది. అకాలవర్షాలకు కాయలు రాలిపోవడంతో మిగిలిన కాయలను మార్కెట్‌లో సైజును బట్టి విక్రయిస్తున్నారు. హుస్నాబాద్ మార్కెట్‌లో ఒక మామిడి కాయ రూ.10 నుంచి రూ.15 వరకు, పెద్ద కాయ అయితే రూ.20 కూడా పలుకుతోంది. పచ్చళ్లకు ఉపయోగించే ఆయిల్, కారంపొడి, ఎల్లిగడ్డ, జిలకర, ఆవాలు, మెంతులు ధరలు కూడా భారీగానే పలుకుతున్నాయి. అయినా ప్రజలు మామిడి పచ్చడి పెట్టుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

మామిడికాయ పచ్చళ్ల రకాలు

పచ్చడి మామిడికాయలతో వివిధ రకాలుగా పచ్చళ్లు తయారు చేసుకోవచ్చు. ఆవకాయ, పెద్ద ముక్కల, ఎల్లిపాయ పచ్చడి, నువ్వులు, ఆవాలు, ఇలా రకరకాలుగా మామిడి పచ్చళ్లను పెట్టుకుంటున్నారు.

తయారీ ఇలా..

ఎండకాలంలో ఎవరి ఇంటికి వెళ్లిన మామిడి పచ్చడి గుమగుమలు నోరూరిస్తాయి. మార్కెట్‌లో మంచి రకంగా ఉండే మామిడికాయలను తీసుకొని వాటిని ముక్కలుగా చేసుకోవాలి. ముక్కలకు సరిపడా ఉప్పు, కారం, ఆవాల పొడి, జీలకర్ర, మెంతుల పొడి కలిపి ముక్కలకు పట్టించి ఊరబెట్టాలి. తర్వాత పోపు పెట్టి మామిడి పచ్చడి తినవచ్చు. ఇండ్లలో ఇలా తయారు చేసిన పచ్చళ్లను తమ కుటుంబ సభ్యులు ఇతర ప్రాంతాల్లో, విదేశాల్లో ఉన్నవారికి పంపిస్తున్నారు.

ఎన్‌హెచ్ 365బీ అలైన్‌మెంట్ మార్పునకు కేంద్రం అంగీకారం



జాతీయ రహదారుల కార్యదర్శి ఉమాశంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ రఘునందన్‌రావు, రైతులు

● రైతులకు నష్టం లేకుండా ప్రత్యామ్నాయ మార్గం
● ఫలించిన ఎంపీ రఘునందన్‌రావు చొరవ

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట-సిద్దిపేట మీదుగా సిరిసిల్లకు వెళ్లే 365బీ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి భూములు కోల్పోతున్న రైతులకు ఊరటనిచ్చే పరిణామం చోటుచేసుకుంది. ఈ రహదారి ప్రాజెక్టు వలన పలు గ్రామాల్లో రైతులు విలువైన సాగుభూములను కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో రైతుల తరపున మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు చొరవ తీసుకొని, రైతుల ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లారు. జాతీయ రహదారుల శాఖ కార్యదర్శి ఉమా శంకర్‌కు వినతిపత్రం సమర్పించారు. దుద్దేడ, ఎన్సాన్‌పల్లి, మర్పడగ, బురుగుపల్లి, ఖమ్మంపల్లి, తడక్కపల్లి, చిన్న గుండవెల్లి, పూల్లూరు, మల్యాల గ్రామాల్లో రైతులు కోల్పోతున్న భూముల వివరాలను అధికారికి వివరించారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు, కాలువల నిర్మాణం కోసం ఇప్పటికే భూములను కోల్పోయి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు సుమారు ఒక గంట పాటు వివరించి, ప్రత్యామ్నాయ మార్గాలను కూడా అధికారుల ముందుంచారు. రైతులకు భూముల నష్టం లేకుండా రాజీవ్ రహదారి, సిద్దిపేట ఔటర్ రింగ్ రోడ్డుతో అనుసంధానం చేసే మార్గాన్ని ప్రతిపాదించారు. ఈ అంశాన్ని అధికారులూ సానుకూలంగా స్వీకరించి, ప్రస్తుతం జరుగుతున్న భూ సర్వేను తాత్కాలికంగా నిలిపి వేసి, మార్గాన్ని పునఃపరిశీలించి, కొత్త అలైన్‌మెంట్ ప్రతిపాదిస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీతో సంబంధిత గ్రామాల్లోని రైతుల్లో ఆనందం, ఊపిరి పీల్చుకున్న భావం నెలకొంది. ఎంపీ రఘునందన్ రావు చూపిన చొరవ రైతుల భవిష్యత్‌కి రక్షణగా నిలిచిందని అన్నదాతలు అభినందిస్తున్నారు. భూముల్ని కోల్పోకుండా మా జీవనాధారాన్ని కాపాడుకునే మార్గం లభించింది. అంటూ రైతులు మడుపు రాంరెడ్డి, ఎరోళ్ల నర్సింలు, భైరినేని సందీప్ రావు, బొడిగె తిరుపతి, చెల్ల రాజలింగం ఎంపీ రఘునందన్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు భైరి శంకర్ ముదిరాజ్, బీజేపీ నాయకులు చింత సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పన్నీరు శ్రీనివాస్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న శ్రీనివాస్

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీగుల్ గ్రామానికి చెందిన తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడు ప్రజా ఉద్యమ గాయకుడు పన్నీరు శ్రీనివాస్ ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నాడు. ఈ సందర్భంగా కళాకారుడు పన్నీరు శ్రీనివాస్ మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుంచి సామాజిక అంశాల ప్రతిభావంతులకు ఈ డాక్టరేట్ అందజేస్తారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ గాయకుడిగా, ప్రజలను చైతన్యవంతులను చేసే విభాగంలో డాక్టరేట్‌గా ఎంపిక చేశారని తెలిపారు. శ్రీనివాస్‌కు డాక్టరేట్ రావడం పట్ల జిల్లా కవులు, రచయితలు, సాహితీవేత్తలు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్లపై ధాన్యాన్ని ఆరబోస్తే చర్యలు

మిరుదొడ్డి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఎవరైనా రైతులు రోడ్లపై ధాన్యాన్ని ఆరబోస్తే కఠిన చర్యలను తీసుకోవడంతో పాటు కేసులను నమోదుచేస్తామని దుబ్బాక సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం దుబ్బాక సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రైతులు కల్లాలవద్ద గానీ, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద వరి ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా పరిశీలన

మద్దూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లద్నూరుకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను ఇంటింటికి వెళ్లి పరిశీలించినట్లు ఎంపీడీవో ఎస్. రాంమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. గ్రామానికి 26 ఇళ్ల జాబితా వచ్చిందన్నారు. అర్హులా కాదా అని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

పెళ్లి రోజున గ్రీన్ చాలెంజ్



మొక్కనాటుతున్న శ్రీనివాస్‌రెడ్డి దంపతులు

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 29: వివాహ వార్షికోత్సవం సందర్భంగా మండలకేంద్రంలో హరితసేన ఆధ్వర్యంలో రెండు జంటలు మంగళవారం మొక్కలు నాటి గ్రీన్‌చాలెంజ్ స్వీకరించాయి. మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ గ్రీన్ చాలెంజ్ హరితసేనలో గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి అనిల్ మొగిలి ఆధ్వర్యంలో జగదేవ్‌పూర్‌లో పడిదం జ్యోతి శ్రీనివాస్‌రెడ్డి, రాజాపేట కనకలక్ష్మి చంద్రం వివాహ వార్షికోత్సవ సందర్భంగా వారి ఇంటి ఆవరణలో మొక్కలు నాటారు.

చిన్నారి పెద్దమనసు



దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న భీమనపల్లి సింధు

చేర్యాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం శభాశ్‌గూడెం గ్రామానికి చెందిన నాగపురి జడ్పీఎస్ఎస్ 6వ తరగతి విద్యార్థిని భీమనపల్లి సింధు పెద్దమనసు చాటుకుంది. తన పుట్టినరోజును పురస్కరించుకుని మానసిక దివ్యాంగులు ఇరువురికి నిత్యావసర సరుకులు అందించి మానవతను చాటుకున్నది. తమ ఉపాధ్యాయుడు అందె విజయ్‌కుమార్ చేస్తున్న సేవలను స్ఫూర్తిగా తీసుకుని ఈ సహాయం అందించామన్నారు.

మన చేతి రాతనే తలరాత

మర్కుక్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సమ్మర్‌క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని అంగడికిష్టాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలకిషన్ అన్నారు. సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులకు స్టోరీ టెల్లింగ్, డ్రాయింగ్ గేమ్స్, హ్యాండ్ రైటింగ్ స్కిల్స్, యోగ మెడిటేషన్ మొదలైన అంశాల పట్ల మెళకువలు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నేర్పించామని నేటితో ఈ కార్యక్రమం ముగుస్తుందని బాలకిషన్ తెలిపారు.

ఈథనాల్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

బెజ్జంకి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతారం గ్రామశివారు నర్సింహులపల్లి గ్రామ సమీపంలో నిర్మిస్తున్న ఈథనాల్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థజలాలను తాగునీటి కాలువలోకి వదులుతున్నారని బీఆర్ఎస్, సీపీఎం నాయకులు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం వేర్వేరుగా ఫ్యాక్టరీ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శనిగరం ప్రాజెక్టు నుంచి ముత్తన్నపేటకు వచ్చే నీటి కాలువను ఫ్యాక్టరీ యాజమాన్యంవారు ధ్వంసం చేసి వ్యర్థజలాలను వదులుతున్నారని మండిపడ్డారు. దీంతో పంటలు పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే దురుసుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి తిప్పారం శ్రీనివాస్, రెండు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

చెక్‌డ్యాంల మరమ్మతులు ఎవరికీ పట్టవా?

- కొండపాక మండలంలో నిర్వహణ లేక శిథిలమవుతున్న చెక్‌డ్యాంలు
- ధ్వంసమై వృథాగా పోతున్న నీరు
- చిన్నపాటి మరమ్మతులను సైతం పట్టించుకోని వైనం
- భూగర్భజలాలు తగ్గిపోయాయని రైతుల ఆవేదన



దుద్దెడ శివారులో నిర్మించిన చెక్‌డ్యాం పక్కన కోతకు గురై వృథాగా పోతున్న నీరు, వెలికట్ట శివారులోని దుద్దెడ వాగుపై నిర్మించిన చెక్ డ్యాం ధ్వంసమైన దృశ్యం

కొండపాక, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జల వనరుల పెంపు కోసం నిర్మించిన చెక్‌డ్యాంలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ధ్వంసమై నెలలు గడుస్తున్నా మరమ్మతుల గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దీంతో చెక్‌డ్యాంల లక్ష్యం అటకెక్కిన చందంగా తయారైంది.

నిర్వహణ గాలికి..

కొండపాక మండలం దుద్దెడ శివారులోని వాగుపై పలుచోట్ల చెక్‌డ్యాంలు నిర్మించారు. వర్షపు నీరు వాగు నుంచి వెంటనే వెళ్లిపోకుండా నిల్వ ఉంచడం కోసం, భూగర్భ జల వనరుల పెంపుదల కోసం చెక్‌డ్యాంల నిర్మాణం చేశారు. కానీ వాటి నిర్వహణ మాత్రం లోపించింది. చిన్న చిన్న మరమ్మతులు సైతం చేపట్టకపోవడంతో నిర్లక్ష్యానికి గురై శిథిలావస్థకు చేరుతున్నాయి. వెలికట్ట శివారులో చెక్‌డ్యాం ఒకవైపు పూర్తిగా దెబ్బతిన్నది. దాంతో వాగు నీరంతా వృథాగా పోతున్నది. మరమ్మతులపై దృష్టి సారించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోవడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వృథాగా పోతున్న నీరు

దుద్దెడ శివారులో ఇదే వాగుపై నిర్మించిన మరో చెక్‌డ్యాం పక్కన భూమి కోతకు గురై నీరంతా వృథాగా పోతున్నది. ఇలా వాగుపై నిర్మించిన చెక్‌డ్యాంలను మరమ్మతు చేయకపోవడంతో వాగులో ప్రవహించే నీరంతా వృథాగా పోతుంది. చెక్‌డ్యాంలో నీరుంటే పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగి, వ్యవసాయ బోర్ల నుంచి పంటలకు అవసరమైన నీరందే అవకాశముంటుంది. అలాంటిది నీరు నిలవకుండా లోతట్టు ప్రాంతాలకు వెళ్లిపోవడంతో ఈప్రాంత రైతులకు ఇబ్బందిగా తయారైంది. వర్షాకాలం లోపు చెక్‌డ్యాంలను మరమ్మతు చేసి భూగర్భ జల వనరుల పెరుగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మండలంలోని రైతులు కోరుతున్నారు.

భూగర్భ నీటిమట్టం తగ్గింది



వాగులో చెక్‌డ్యాంలు నిర్మించడంతో ఆ ప్రాంతంలో బోర్లు, బావుల్లో పుష్కలంగా నీరుండేది. చెక్‌డ్యాంల మరమ్మతులను పట్టించుకోకపోవడంతో అవి ధ్వంసమై వాగులో నీరు నిలువడంలేదు. దీంతో పరిసరాల్లో భూగర్భ నీటిమట్టం తగ్గింది. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకొని వర్షాకాలం లోపు చెక్‌డ్యాంలను మరమ్మతు చేసి భూగర్భ జలాల పెంపునకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- రోసిలీ యాదయ్య, దుద్దెడ రైతు

తెలుగు సాహిత్యం, ఉపాధి అవకాశాలపై చర్చ

- సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాల కార్యక్రమం



అంతర్జాల చర్చలో అధ్యాపకులు, విద్యార్థులు

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యం పరిశోధన, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అనే అంశంపై అంతర్జాల చర్చ కార్యక్రమాన్ని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగు శాఖాధ్యక్షుడు డా. మట్టా సంపత్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన కరీంనగర్ శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎం.ఏ తెలుగు విద్యార్థులకు సంయుక్తంగా అంతర్జాల చర్చా కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో మూడు కళాశాలల విద్యార్థులు తెలుగు ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాల గురించి చర్చించారు. ప్రాథమిక స్థాయి నుండి విశ్వవిద్యాలయ పరిధి వరకు తెలుగులో ఉపాధ్యాయులుగా, అధ్యాపకులుగా, సివిల్ సర్వీసెస్‌లో తెలుగును ఒక అంశంగా ఎంచుకొని విజేతలుగా నిలువవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. డీటీపీ టైపింగ్, తెలుగులో కరపత్రాలు, గూగుల్, వికీపీడియాలో రచయితలుగా, తెలుగు అనువాదకులుగా, ప్రూఫ్ రీడర్లుగా, పత్రికా సంపాదకులుగా, పరిశోధకులుగా రాణించవచ్చన్నారు. కృత్రిమ మేధస్సును ఉపయోగించి వస్తున్న సాంకేతికతను తెలుగు భాషా రంగంలో ఉపాధి అవకాశాలుగా మలుచుకోవాలని తెలుగు విభాగాధ్యక్షుడు డా.మట్టా సంపత్‌కుమార్ రెడ్డి సూచించారు. సమన్వయకర్త పిట్ల దాస్ మాట్లాడుతూ.. అందుబాటులో ఉన్న సాంకేతిక సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నారోజు వెంకటరమణ, డా.బూర్ల చంద్రశేఖర్, డా. ప్రకాశ్, భోజన్న, డా. ఆర్ మహేందర్ రెడ్డి, అధ్యాపకులు చక్రహరి రమణ, బానోజు సంపత్, స్నాతకోత్తర విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీని నమ్ముకున్న వారికే నామినేటెడ్ పోస్టులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ నాయకుడు విశ్వనాథన్

సిద్దిపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కష్టకాలంలో పార్టీని నమ్ముకున్న వారికే నామినేటెడ్ పోస్టులు దక్కుతాయని ఏఐసీసీ నాయకుడు విశ్వనాథన్ పేర్కొన్నారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో ఏఐసీసీ నాయకుడు విశ్వనాథన్ కరీంనగర్ వెళ్తున్న సందర్భంగా కాసేపు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్ష మేరకు తెలంగాణ రాష్ట్రాన్ని అందించిన కాంగ్రెస్ పార్టీపై కేసీఆర్ చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు ఎక్కడికక్కడ తిప్పికొట్టాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం ప్రజా సంక్షేమ పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేశారన్నారు. మహిళల కోసం ఉచిత బస్సు పథకం ప్రవేశపెడితే మహిళలను అవమానించేలా కేసీఆర్ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అద్భుతంగా పనిచేస్తున్నారని మెచ్చుకున్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ ప్రతీ కార్యకర్తకు న్యాయం జరుగుతుందని భరోసానిచ్చారు.

ఉపాధి పనుల్లో తప్పులకు అధికారులదే బాధ్యత

ములుగు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో ఎలాంటి తప్పులు జరిగినా సంబంధిత అధికారులే బాధ్యత వహించాలని జిల్లా డీఆర్డీవో బాలకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ ఆవరణలో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. మండలంలోని 26 గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధిహామీ పనులపై రూపొందించిన నివేదికలను సమావేశంలో వినిపించారు. ఈ మేరకు మండలంలో మొత్తం రూ. 3,63,54,973 విలువైన ఉపాధి పనులు జరిగాయి. 13 పంచాయతీల్లో సక్రమ ఏర్పాట్లు చేయకపోవడం వల్ల రూ.21వేల జరిమానా వేస్తున్నట్లు, 12 గ్రామ పంచాయతీల్లో ఎక్కువ డబ్బులు చెల్లించినందుకు రూ.31,062 రికవరీకి ఆదేశించినట్టు వివరించారు.

ఉగ్రవాదులకు బుద్ధిచెప్పాల్సిందే

- పహల్గాం మృతులకు నర్సింగ్ విద్యార్థుల నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందినవారికి ఆత్మశాంతి చేకూరాలని సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో మంగళవారం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. యునైటెడ్ ఇండియా అని నినదించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. కేటీ షిబా మాట్లాడుతూ.. పహల్గాం ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండించారు. భారతీయులంతా ఏకతాటిపై నిలిచి ఉగ్రవాదులకు, వారికి సహకరిస్తున్న వారికి గట్టిగా బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. దేశాన్ని దొంగదెబ్బ తీయడానికి యత్నిస్తున్నవారికి బుద్ధి చెప్పేందుకు కుల, మతాలకు అతీతంగా అందరం ఒక్కటిగా నిలిచి భారతీయుల సత్తా చూపించాలన్నారు. ఈ సమయంలో దేశ ప్రధాని మోదీకి మనమంతా మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.విజయ్‌కుమారి, ఏవో సురేందర్, ఆఫీస్ సూపరింటెండెంట్ రాం దామోదర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



భక్తులకు అనుగ్రహభాషణం చేస్తున్న మాధవానంద సరస్వతీస్వామి

చేర్యాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): దైనందిన జీవితంలో ప్రతీ ఒక్కరూ అధ్యాత్మికచింతన అలవర్చుకోవాలని, భగవన్నామ సంకీర్తనతో తప్పక మోక్షం కలుగుతుందని తొగుట పాండురంగాశ్రమం పీఠాధిపతి మాధవానంద సరస్వతిస్వామి పేర్కొన్నారు. చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలోని శ్రీభవానీరుద్రేశ్వరాలయంలో నిర్వహిస్తున్న శ్రీరుద్ర సహిత శతచండీయాగంలో భాగంగా శ్రీమాతా శతరుద్రీయ సేవాపరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం సామూహిక కుంకుమార్చనకు మహిళలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అనంతరం మాధవానంద సరస్వతిస్వామి భక్తులనుద్దేశించి అనుగ్రహ బాషణం చేశారు.

సమ్మర్‌క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి



భూంపల్లిలో మాట్లాడుతున్న ఎంఈవో అంజయ్య

మిరుదొడ్డి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలంటే ప్రాథమికస్థాయి నుంచి ప్రణాళికలను ఏర్పరుచుకోవాలని అక్బర్‌పేట-భూంపల్లి మండల విద్యాధికారికి అంజయ్య, మోటివేషన్ వక్తలు భగవాన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఎనగుర్తి, అక్బర్‌పేట-భూంపల్లిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటుచేసిన వేసవిశిక్షణ శిబిరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు విద్యార్థి దశ నుంచే తమ లక్ష్యాలను ఎంచుకోవాలని తెలిపారు. దానికి అనుగుణంగా ముందుకుసాగాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులున్నారు.

అర్హులైన వారికే రాజీవ్ యువ వికాస పథకం

- దుబ్బాక మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి

మిరుదొడ్డి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అవకతవకలకు చోటు లేకుండా, బ్యాంకర్ల సహకారంతో నిష్పక్షపాతంగా లబ్ధిదారులను ఎంపిక చేసి, అర్హులైనవారికే రాజీవ్ యువ వికాస పథకాన్ని అమలు చేస్తామని దుబ్బాక మున్సిపల్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని వివిధ బ్యాంకుల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి, రాజీవ్ యువ వికాస పథకానికి సంబంధించిన విధివిధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక మున్సిపల్ పరిధిలో రాజీవ్ యువ వికాస పథకం కింద వివిధ యూనిట్లకు 1,690 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతకు రాయితీలపై రుణ సదుపాయం అందించేందుకు రాష్ట్రప్రభుత్వం రాజీవ్ యువ వికాస పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉంటుందని, దరఖాస్తుదారుల ఆధార్, రేషన్ కార్డు, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు ఇతర అర్హత ప్రమాణాలను బ్యాంకు సిబ్బందితో కలిసి క్షుణ్ణంగా పరిశీలిస్తారన్నారు. సమావేశంలో పురపాలిక మేనేజర్ శ్రీనివాస్, దుబ్బాక ఎస్‌బీఐ మేనేజర్ సందీప్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ సుధీర్‌కుమార్, ఇతర బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడే చివరి తేదీ

(5వ పేజీ తరువాయి)

91,161 దరఖాస్తులకు గానూ ఇప్పటివరకు 16,118 మంది మాత్రమే ఎల్ఆర్ఎస్ ఫీజును చెల్లించారు. జిల్లా మొత్తంగా ఎల్ఆర్ఎస్ చెల్లింపుల ద్వారా వచ్చిన మొత్తం ఆదాయం రూ. 27.52 కోట్లు ప్రభుత్వ ఖజానాలో జమచేశారు. 16,118 మంది ఫీజులు చెల్లించినప్పటికి వీరిలో 9,517 మందికి మాత్రమే అధికారులు ప్రొసెడింగ్ పత్రాలను అందించారు.

కానరాని స్పందన

ఎల్ఆర్ఎస్ ఫీజు కట్టేందుకు ముందుగా మార్చి 1 నుంచి 31 వరకు తుది గడువును ప్రభుత్వం విధించింది. పలువురు దరఖాస్తుదారుల విన్నపం మేరకు ప్రభుత్వం రాయితీని కొనసాగిస్తూ ఏప్రిల్ చివరి వరకు గడువును పెంచింది. ఎల్ఆర్ఎస్ ఫీజును రాబట్టేందుకు అధికారుల సూచన మేరకు సిబ్బంది, దరఖాస్తుదారులకు ఫీజు చెల్లించాలంటూ కాల్ చేసి ఎల్ఆర్ఎస్ ఫీజుపై 25 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని సూచించినా స్పందన అంతంత మాత్రంగానే వచ్చింది. రూ.లక్షల్లో దరఖాస్తులు రావడంతో ఫీజు రాయితీని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించినా దరఖాస్తుదారులు మాత్రం నామమాత్రంగా స్పందించారు.

ఇసుక అక్రమ డంపు స్వాధీనం

కోహెడ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగళ్లపల్లి గ్రామశివారులో ఇసుక అక్రమ డంపును కోహెడ పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా డంప్ చేశారనే విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం పోలీసులు దాడి చేసి 95 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల కోసం ఇసుక డంపును తహసీల్దార్‌కు అప్పగించినట్టు పోలీసులు తెలిపారు. కాగా తంగళ్లపల్లి గ్రామ శివారులోని మోయ తుమ్మెద వాగు నుంచి కొందరు అక్రమార్కులు అధికారులు, ప్రజాప్రతినిధుల పేరు చెప్పుకుంటూ రాత్రిపూట ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని పలువురు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు బాధితులకు అప్పగింత



బాధితులకు ఫోన్లను అప్పగిస్తున్న గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ డివిజన్ పరిధిలో కొన్ని రోజుల క్రితం పోగొట్టుకున్న 45 మొబైల్ ఫోన్‌లను పోలీసులు రికవరీ చేశారు. ఈ మేరకు గజ్వేల్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం బాధితులకు రికవరీ చేసిన ఫోన్‌లను ఏసీపీ పురుషోత్తంరెడ్డి చేతుల మీదుగా అప్పగించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ ఎక్కడైనా పడిపోయినా, ఎవరైనా దొంగిలించినా వెంటనే సీఈఐఆర్ పోర్టర్‌లో డాటా నమోదు చేసినట్లయితే ఫోన్ రికవరీ చేసే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదా, తొగుట సీఐ లతీఫ్, రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి ఉన్నారు.

● హుస్నాబాద్‌రూరల్: ఇటీవల హుస్నాబాద్ పరిధిలో పోగొట్టుకున్న, చోరీ అయిన 11 సెల్‌ఫోన్‌లను పోలీసులు సీఈఐఆర్ సాంకేతికత ద్వారా రికవరీ చేశారు. ఈ మేరకు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్‌లను మంగళవారం హుస్నాబాద్‌లో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ పోయిన వెంటనే సీఈఐఆర్ లాగిన్ ఓపెన్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ మహేష్ డివిజన్ పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులను టార్గెట్ చేయడం దుర్మార్గం

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ రంగంలో నిబద్ధతతో పనిచేస్తున్న ఎస్సీఎస్టీ ఉపాధ్యాయులపై డీటీఎఫ్ సంఘం నాయకుడు టార్గెట్ చేసి సస్పెండ్ చేయించడం దుర్మార్గమైన చర్య అని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ కిషన్‌నాయక్ పేర్కొన్నారు. మంగళవారం హుస్నాబాద్‌లో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ సమావేశానికి కిషన్‌నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నీతి నిజాయితీగా పనిచేస్తున్న మీర్జాపూర్ హైస్కూల్ హెచ్‌ఎం వేణుకుమార్‌ను డీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు లింగారెడ్డి వ్యక్తిగత కక్షసాధింపుతో సస్పెండ్ చేయించడం తగదన్నారు. సస్పెన్షన్‌కు గురైన వేణుకుమార్‌ను విధుల్లోకి తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సంఘం పక్షాన కోరుతున్నట్లు కిషన్‌నాయక్ పేర్కొన్నారు. సమావేశంలో సిద్దిపేట జిల్లా అధ్యక్షులు శంకర్‌నాయక్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, పీజీ హెచ్ఎం వెంకటయ్య, బండి సమ్మయ్య, శంకర్‌నాయక్, మోహన్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ స్పీచ్ అమోఘం: బీఆర్ఎస్



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఎల్కతుర్తిలో జరిగిన రజతోత్సవ సభలో కేసీఆర్ మాట్లాడిన తీరు అమోఘమని, తెలంగాణ ప్రజల హృదయాలను తట్టిందని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పోచబోయిన శ్రీహరి యాదవ్, జాప శ్రీకాంత్ రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి, లక్కరసు ప్రభాకర్ వర్మ, బూమన్నగారి కిషన్ రెడ్డి ఇరుగంటి రమేష్ పాల్గొని మాట్లాడారు. కేవలం తెలంగాణకు మాత్రమే పరిమితం కాకుండా విదేశీ ఉగ్రవాద దాడుల్ని ఖండించడం, అంతర్గత భద్రత పేరుతో మధ్య భారతంలో దండకారణ్యంలో కొనసాగుతున్న ఆదివాసుల ఊచకోతపై కూడా కేసీఆర్ మాట్లాడటం యావత్తు తెలంగాణలో చర్చ జరుగుతుందన్నారు. అలాగే కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టడంపై కూడా గ్రామాల్లో చర్చ జరుగుతున్నదన్నారు.

ఆర్గానిక్ పద్ధతిలో పంటలను సాగు చేయాలి

అక్కన్నపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఆర్గానిక్ పద్ధతిలో రైతులు పంటలు సాగు చేయాలని ప్రకృతి వ్యవసాయం చేసే ఉత్తమ రైతు డాక్టర్ మురళి సూచించారు. మంగళవారం మండలంలోని పలు గిరిజన తండాలకు చెందిన రైతులు హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో ఆర్గానిక్ పద్ధతిలో వ్యవసాయం సాగు చేస్తున్న వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఆర్గానిక్ పద్ధతిలో సాగు చేస్తున్న పండ్ల తోటలు, కూరగాయలు, వివిధ పంటలను సందర్శించారు. అనంతరం ఆర్గానిక్ సాగు పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో లోడి సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బాలశౌరి, కోఆర్డినేటర్ కోడం సత్యనారాయణ, సంస్థ ప్రతినిధులు కనకం రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

సుందరకాండ కార్యక్రమానికి దుర్గాప్రసాద్ స్వామిజీ

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శ్రీసంతోషిమాత ఆలయంలో సుందరకాండ హవన కార్యక్రమం శాస్త్రోక్తంగా కొనసాగుతోంది. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాల్లో అఖిలభారత హనుమాన్ పీఠాధిపతి శ్రీదుర్గాప్రసాద్ స్వామిజీ పాల్గొననున్నట్లు మంగళవారం ఆలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆలయ నిర్వాహకులు తెలిపారు. మూడవ రోజైన బుధవారం హనుమాన్ భజన, పూర్ణాహుతి కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారని తెలిపారు. అంతేకాకుండా అష్టోత్తర శత కలశాభిషేకం, అర్ధమండల హనుమాన్ దీక్ష తీసుకునే భక్తులు శ్రీదుర్గాప్రసాద్ స్వామిజీ చేతుల మీదుగా మాలధారణ చేయనున్నారు. సమావేశంలో ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి రామకృష్ణమాచార్యులు, అఖిలభారత హనుమాన్ మాల దీక్ష మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అక్షయ తృతీయ నుంచి హనుమాన్ మాలధారణ

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని గణేష్ నగర్ శ్రీప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో అక్షయ తృతీయ నుంచి హనుమాన్ జయంతి వరకు హనుమాన్ మాలధారణ, భక్తులకు (భిక్ష) అన్నప్రసాద వితరణకు ఏర్పాట్లు చేశారు. గణేష్‌నగర్ హనుమాన్ ఆలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి హనుమాన్ జయంతి వరకు ఆలయంలో నిర్వహించనున్న కార్యక్రమ వివరాలను ఆలయ కమిటీ వెల్లడించింది.

'సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య'

చిన్నకోడూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్లా షరీఫ్ పేర్కొన్నారు. మండలంలోని రామంచ గ్రామంలో మంగళవారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ముందస్తు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీల్లో ఐదేళ్లకు పైబడిన విద్యార్థుల వివరాలు సేకరించారు.

గజ్వేల్‌లో యువతి అదృశ్యం

గజ్వేల్ రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యమైన ఘటన గజ్వేల్ పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం గొడుగుపల్లి గ్రామానికి చెందిన దుర్గని అంకిత(22) డిగ్రీ పరీక్షలు ఉన్నందున నానమ్మ దుర్గని లక్ష్మితో కలిసి గజ్వేల్‌కి వచ్చి వెళ్తుంది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇంటి నుంచి గజ్వేల్ పట్టణంలోని ఎడ్యుకేషన్ హబ్ వద్దకు రాగానే నీళ్ల బాటిల్ తీసుకొస్తానని నానమ్మ లక్ష్మికి చెప్పి వెళ్లింది. ఎంతకూ తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గజ్వేల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.